సాక్షి నిజామాబాద్


శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



క్రీడలతో మానసికోల్లాసం

ఆధునిక యుగంలో క్రీడలతోనే ప్రతి ఒక్కరిలో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఐసీడీఎస్ పీడీ రసూల్‌బీ అన్నారు.

- 8లో ▸



ధరణి దారికొచ్చేనా..

సీఎం రేవంత్‌రెడ్డి ధరణిపై సమీక్ష నిర్వహించడంతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.6 / 16.4

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

17 నుంచి పీజీ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్ : ఈనెల 17వ తేదీ నుంచి పీజీ రెండో సంవత్సరం తరగతులు ప్రారంభమవుతున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ కో–ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏలో హిస్టరీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఎంఎస్సీలో గణితం, సైకాలజీ, ఎంకాం, ఎంబీఏ థర్డ్ ఇయర్ సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. మిగితా వివరాలకు 7382929612లో సంప్రదించాలన్నారు.

19 నుంచి స్థాయీ సంఘ సమావేశాలు

నిజామాబాద్ నాగారం : జెడ్పీలో స్థాయీ సంఘ సమావేశాలు 19 నుంచి 21వ తేదీ వరకు ఉంటాయని జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలు జెడ్పీ చైర్మన్ విఠల్ రావు అధ్యక్షతన జరుగుతాయన్నారు. 19న ఉదయం 11 గంటలకు వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు గ్రామీణాభివృద్ధి, 20న ఉదయం 11 గంటలకు విద్య, వైద్య, మధ్యాహ్నం 2 గంటలకు మహిళా, శిశు సంక్షేమం, 21న ఉదయం సాంఘిక సంక్షేమంపై, మధ్యాహ్నం పనులు, ఆర్థిక ప్రణాళిక ఉంటాయన్నారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

నేటి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు క్రీడలు

నిజామాబాద్ నాగారం : జిల్లా ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17 వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్, భోజాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ప్రారంభమయ్యే క్రీడాపోటీలకు సీపీ కల్మేశ్వర్ హాజరవుతున్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి హాజవవుతున్నట్లు తెలిపారు.

ఉచిత ప్రయాణానికి గుర్తింపు కార్డు తప్పనిసరి

ఖలీల్‌వాడి : నేటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళ ప్రయాణికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకొని రావాలని ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్సుల్లో మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. అయితే నేటి నుంచి బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందాలనుకునేవారు తప్పనిసరిగా ఏదోఒక ఐడీ కార్డు తీసుకుని రావాలని సూచించారు. ఆ ఐడీ ప్రూఫ్‌లో తమ ఫొటో, అడ్రస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆధార్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన గుర్తింపు కార్డుతో పాటు డిసేబుల్డ్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ డైరెక్టరేట్ ద్వారా జారీ చేయబడిన నివాస అడ్రస్ ఉన్న గుర్తింపు కార్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేయబడిన నివాస గుర్తింపు కార్డు తమతో ఉండాలన్నారు.

జీతాలివ్వకుంటే విధుల్లోకి వచ్చేది లేదు




సుభాష్‌నగర్ : జిల్లాలోని వివిధ శాఖల్లో సర్దుబాటైన పూర్వ వీఆర్‌ఏలకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని మాజీ అధ్యక్షుడు గైని దయాసాగర్ కోరారు. లేకుంటే శుక్రవారం నుంచి విధులకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. గురువారం ఈమేరకు సుమారు 50 మంది పూర్వ వీఆర్‌ఏలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గైని దయాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలనుసారం గత ఆగస్టులో రాష్ట్రంలోని వీఆర్‌ఏలను విద్యార్హతలు, అనుభవం మేరకు వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, రికార్డ్ అసిస్టెంట్, హెల్పర్లు, అటెండర్లు, లస్కర్లు, చైన్‌మెన్, ఇతర వర్కులుగా నియమితులయ్యారని, కాని వారికి ఆగస్టు నుంచి వేతనాలు రావట్లేదన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వలేదన్నారు. వెంటనే జీతాలివ్వాలని లేకపోతే శుక్రవారం నుంచి విధుల్లోకి రామన్నారు. నాయకులు సాయన్న, సాయినాథ్, సంతోష్, గజ్జెల శంకర్, హరిచరణ్, పూర్వ వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

దోపిడీకి ఎదురొడ్డిన తల్వేద

- నాడు ఇసుక దోపిడీకి జీవన్‌రెడ్డి కుట్రలు
- భూగర్భ జలాలు కాపాడుకునేందుకు జీవన్‌రెడ్డితో రైతుల పోరాటం
- నెలల తరబడి చేసిన పోరాటానికి రేవంత్ రెడ్డి, కోదండరాం మద్దతు
- చివరకు విజయం సాధించిన వైనం
- 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న గ్రామస్తులు

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేసిన అక్రమ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నందిపేట మండలం తల్వేద గ్రామస్తులు తమ ఊరిలో భూగర్భ జలాలు కాపాడుకునేందుకు జీవన్‌రెడ్డితో నెలల తరబడి పోరాటం చేశారు. 2015లో బెదిరింపులకు వెరవకుండా గ్రామస్తులు చేసిన పోరాటానికి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం కూడా మద్దతు తెలిపారు.



గ్రామస్తులు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు (ఫైల్)



దీక్ష చేస్తున్న తల్వేద గ్రామస్తులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గత రెండేళ్లుగా తాజా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై అక్షరయజ్ఞం చేస్తున్న 'సాక్షి'తో గ్రామస్తులు తమ అనుభవాలు పంచుకున్నారు. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో భాగంగా గ్రామంలోని పులాంగ్ వాగులో నిరంతరం నీరు ఉంటోంది. దీంతో గ్రామంలో భూగర్భ జలాలు అధికంగా ఉండి చుట్టుపక్కల ప్రాంతాల్లో కరువు ఉన్న సమయంలోనూ ఇక్కడ మాత్రం గ్రౌండ్‌వాటర్ పుష్కలంగా ఉండడంతో సమృద్ధిగా పంటలు పండాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ముంపునకు గురై పరిహారం రాని ఓ రైతు నుంచి జీవన్‌రెడ్డి తన బావమరిది అర్గుల్ రాజేందర్‌రెడ్డి పేరుతో 6 ఎకరాలు కొన్నాడు. ఇందులో 20 అడుగుల లోతులో ఇసుక ఉంది. ఈ ఇసుకను తరలించేందుకు జీవన్‌రెడ్డి టిప్పర్లను పంపడంతో రైతులు అడ్డుకున్నారు. దీంతో రైతులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో రైతులు ఐదు నెలల పాటు ఏకధాటిగా ఇసుక తరలింపునకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.

వాల్టా చట్టం ప్రకారం ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు తగ్గిపోతాయని, ఇసుక తవ్వకాన్ని సహించేది లేదని గ్రామస్తులు చెప్పారు. జీవన్‌రెడ్డి బెదిరింపుల నేపథ్యంలో గ్రామస్తులు రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాంలకు విషయాన్ని చెప్పారు. వారి సహకారంతో ప్రతిపక్షాలను కూడగట్టిన రైతులు ఇసుక తవ్వకాన్ని నిలువరించారు. ఈ క్రమంలో రైతులు కరువు సమయంలో తాము పండించిన పంటకు సంబంధించిన వివరాలను సహకార సంఘం ద్వారా సేకరించారు. ఈ ఆధారాలు, వివరాలతో రైతులు గ్రామపంచాయతీ తరఫున కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా వరుసగా ఫిర్యాదులు చేశారు. నెలల తరబడి దీక్షలు సైతం చేశారు. చివరకు జీవన్‌రెడ్డి వెనక్కి వెళ్లేలా చేశారు. దీంతో ఇసుక తవ్వకం లేకుండా రైతులు, గ్రామస్తులు విజయం సాధించారు. గ్రామస్తులంతా కలసికట్టుగా సమస్యను ఎదుర్కోవడం విశేషం.

వణుకు పుట్టిస్తోంది..



ఏడాది	కనిష్ట ఉష్ణోగ్రతలు (సగటున)
2019	22.5
2020	22.0
2021	20.6
2022	13.0

జిల్లాపై చలిపంజా

- 16.5 డిగ్రీల సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు
- రానున్న రోజుల్లో 12 డిగ్రీలకు పడిపోయే అవకాశం..!
- గతేడాది కంటే ఈసారి చలి అధికమే..
- ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్యులు

సుభాష్‌నగర్: గడిచిన వారంరోజులుగా జిల్లాలో చలి పంజా విసురుతోంది. క్రమంగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ప్రస్తుతం సగటున 16.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చిన్నమావందిలో 13.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. వీటికితోడు పగలు, రాత్రిపూట చలిగాలులు వీస్తున్నాయి. ఈశాన్యం వైపు నుంచి గాలులు వీస్తుండటంతోనే కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రానున్న రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశముంది. ఆస్తమా, డయాబెటిక్, బీపీ పేషెంట్లు, చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

అక్టోబర్ నుంచి..

అక్టోబర్ 1 నుంచి శీతాకాలం సీజన్ ప్రారంభమైంది. జనవరి 15 వరకు చలి ఉంటుంది. జిల్లాలో సగటు గరిష్ట ఉష్ణోగ్రతలు 27 నుంచి 29 డిగ్రీల వరకు, కనిష్ట ఉష్ణోగ్రతలు 16 నుంచి 17 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో 14 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉంటాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతల్లో స్వల్ప మార్పులు వచ్చే అవకాశముంది. మరో నెలరోజులు చలి ఉండగా, ఉదయం 9 వరకు పొగమంచు ఉంటుంది.

గతేడాది కంటే అధికంగానే..

జిల్లాలో చలి తీవ్రత గతేడాది కంటే అధికంగానే ఉంది. రాత్రివేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముంది. ప్రస్తుతం సగటు కనిష్ట ఉష్ణోగ్రతలు 16.5 నమోదు కాగా, గురువారం జిల్లాలోని చిన్నమావందిలో 13.3 డిగ్రీల అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చలి తీవ్రత పెరుగుతుండటంతో 9 గంటలైనా బయటికి రాలేకపోతున్నారు. చలి కారణంగా ఉదయం వాకింగ్‌కు వెళ్లేందుకు జంకుతున్నారు. అదే విధంగా రాత్రిపూట 8 గంటలు కాక ముందే ఇళ్లకు చేరుకుంటున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వారం రోజులుగా చలి తీవ్రంగా ఉంటుంది. ఆస్తమా, షుగర్, బీపీ, గర్భిణులు, బాలింతలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి. చలిలో ఎలాంటి ప్రయాణాలు చేయవద్దు. ఇళ్లల్లోనే యోగా, ఎక్సర్‌సైజులు చేసుకోవాలి. వేడి నీరు తాగితే శరీర ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకుంటాయి. వృద్ధులు ఈదురుగాలుల సమయంలో బయటికి వెళ్లొద్దు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ఉలెన్ దుస్తులు ధరించాలి. చలిగాలులు వీస్తుండటంతో బయటికి రాకపోవడమే ఉత్తమం.

– డాక్టర్ దీపక్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్

కొత్త ఏడాదికి 'ఉపాధి' బడ్జెట్

- అంచనాలు రూపొందిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ
- గ్రామాల్లో పనులు గుర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు



డొంకేశ్వర్ మండలంలోని గాదేపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ లేబర్ బడ్జెట్‌ను గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందిస్తోంది. కొత్త ఏడాదికి అవసరమయ్యే పనులు గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలిచ్చారు. దీంతో గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. ఏయే పనులు ప్రతిపాదించాలో కూలీలతో చర్చించి మండల కార్యాలయాలకు తీర్మాణాలు అందజేస్తున్నారు. ప్రధానంగా వేసవిలో చెరువుల్లో పూడికతీత, నర్సరీల నిర్వహణ, హరితహారంలో మొక్కలు నాటడం, ఇతర పనులను నమోదు చేస్తున్నారు. ఐతే, సర్పంచుల పదవీ కాలం ముగియనుండడంతో సీసీ రోడ్లు, మట్టి రోడ్లు, సీసీ డ్రెయిన్లు లాంటి అభివృద్ధి పనులు కూడా కావాలని తీర్మానాలు ఇస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి గ్రామ సభలు పూర్తి చేసి జిల్లా కార్యాలయానికి అంచనా ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులు గడువు విధించారు. దీంతో ఫీల్డ్‌అసిస్టెంట్లు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో మొత్తం 530 జీపీల నుంచి తీర్మాణాలు వచ్చిన వెంటనే కలెక్టర్ ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపనున్నారు. గతేడాది 70 లక్షల పనిదినాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే, 40.49 లక్షల పనిదినాలకు అనుమతి లభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో మూడు నెలలుగా ఉండగానే లక్ష్యానికి మించి 41.22లక్షల (101.81శాతం) పనిదినాలు కల్పించారు. పనికి వచ్చిన కూలీలకు రూ. 66.52 కోట్ల ఉపాధి లభించింది. ఇందులో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 607 ఉన్నాయి. ఐతే, 2024–25 ఏడాదికి పంపనున్న ప్రతిపాదనల్లో ఎన్ని పనిది నాలకు ప్రభుత్వం అనుమతిస్తుందో వేచి చూడాలి.

రాంమఠంపై హక్కు మాదే..

- మఠం ఉత్తరాధికారి సీతారామచంద్ర స్వామి

నిజామాబాద్ సిటీ : నగరంలోని గాజుల్‌పేట్ బడా రాం మఠంపై హక్కు తమదేనని రాం మఠం ఉత్తరాధికారి సీతారామచంద్ర స్వామి గురువారంఒక ప్రకటనలో తెలిపారు. రాం మఠంను జిల్లా దేవాదాయ శాఖ అధీనంలో తీసుకునే విషయంలో హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉందని, ఈ ఆర్డర్‌ను కాదని దేవాదాయ శాఖ రాం మఠంను ఆధీనంలోకి ఎలా తీసుకుంటారన్నారు. రాంమఠం 14వ పీఠాధిపతి దినకర్ స్వామి గత అక్టోబర్ 23న మృతిచెందగా, సజ్జన్‌ఘ డ్ నుంచి రాంమఠం ఉత్తరాధికారి ఇన్‌చార్జి మఠాధిపతిగా రామచంద్రస్వామి కొనసాగుతున్నారన్నారు. గత నెల 25న దేవాదాయ శాఖ సిబ్బంది రాంమఠంకు వచ్చి ఆఫీస్‌కు వేసిన సీల్‌ను తొలగించి ముఖ్యమైన రికార్డులను తీసుకెళ్లారన్నారు. ఈ విషయమై దేవాదాయ శాఖ హైదరాబాద్ కమిషనర్‌కు కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ కాపీని వారికి ఇచ్చామన్నారు. హైకోర్టు స్టే ఉన్నందున కాస్తుదారుల డబ్బులు, కిరాయిదారుల డబ్బులు ఎవరికీ చెల్లించవద్దని ఆయన తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం

- బోధన్‌లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



బోధన్‌లో కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

బోధన్ : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్ల కోసం అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశం మేరకు ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. గురువారం బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలో ఉన్న ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూంలు సంబంధించి అనువుగా ఉన్న కేంద్రాలను పరిశీలించేందుకు కలెక్టర్ ఆర్‌కే కళాశాలను సందర్శించారు. వీటితో పాటు రవాణా, వాహనాల పార్కింగ్ సదుపాయాలు, భద్రత పరమైన అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఓట్ల కౌంటింగ్, స్ట్రాంగ్ రూంల కోసం అనువైన గదులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో మరింత క్షుణంగా కళాశాల భవనాలను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బోధన్ తహసీల్దార్ గంగాధర్ తదితరులున్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, వెంకటరమణా రెడ్డి

బీజేపీ ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

అసెంబ్లీలో గురువారం ఉమ్మడి జిల్లా బీజేపీ ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

యాసంగికి నీటి విడుదల ఖరారు..!

- ఈనెల 18 నుంచి..
- 60 టీఎంసీల నీటి కేటాయింపు
- వారబందీ ప్రకారం నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టడానికి ఎట్టకేలకు షెడ్యుల్ ఖరారైంది. ఈనెల 18 నుంచి ఆయకట్టుకు కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అందులో తాగునీటి అవసరాలకు, డెడ్‌స్టోరేజీ ఆవిరి రూపంలో పోయే నీరు పోగా ఉన్న నీటి ప్రకారం లెక్కలు వేసి 60 టీఎంసీల నీటిని ప్రస్తుత యాసంగి సీజన్‌కు కేటాయించారు. నీటి విడుదల షెడ్యుల్ ఖరారు కాకపోవడంతో ఆయకట్టు రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సకాలంలో నీటి విడుదల చేపట్టడానికి సన్నాహాలు జరుగుతుండటంపై ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా డిసెంబర్ 18 నుంచే ఆయకట్టుకు నీటి విడుదలను ప్రాజెక్ట్ అధికారులు ప్రారంభించారు.

లక్ష్మి, సరస్వతి కాలువల ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టుకు కాకతీయ కాలువ ద్వారా వారబందీ ప్రకారం నీటి విడుదల చేపట్టడానికి ప్రాజెక్ట్ ఉన్నత అధికారులు నిర్ణయించారు. వారంలో 8 రోజులు 5,500 క్యూసెక్కులు, మరో 7 రోజులు 3 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేపట్టాలని నిర్ణయించారు. లక్ష్మి, సరస్వతి కాలువ ద్వారా నిరంతరం నీటి విడుదల జరుగుతుంది. ఎల్‌ఎండీ ఎగువ భాగం వరకు, లక్ష్మి, సరస్వతి కాలువ ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల ఆయకట్టుకు, చౌట్‌పల్లి హన్మంత్ రెడ్డి ఎత్తిపోతల ఆయకట్టుకు నీటి విడుదల చేపట్టడానికి నిర్ణయించారు. మొత్తం కలిపి సుమారుగా 6.5లక్షల ఎకరాలకు సాగు నీరు అందనుంది. గతేడాది కూడా అంతేస్థాయిలో ఆయకట్టుకు నీటి సరఫరా చేపట్టారు. ప్రస్తుత సంవత్సరం గతేడాది కంటే 9 టీఎంసీల నీరు తక్కువగా ఉంది.

నిలకడగా నీటి మట్టం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఔట్‌ఫ్లో, ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ నుంచి మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 420 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1088.50(78 టీఎంసీలు) అడుగుల నీరు నిల ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

విడుదల చేస్తాం..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి యాసంగి సీజన్‌కు ఈ నెల 18 నుంచి నీటి విడుదలని చేపట్టాలని శివం కమిటీలో నిర్ణయించారు. వారబందీ ప్రకారం నీటి విడుదలను చేపడుతాం. రైతుల ఆందోళన చేందాల్సిన అవసరం లేదు.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

అగ్నికి ఆహుతి

- కామారెడ్డిలో భారీ అగ్ని ప్రమాదం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఘటన
- 19 గంటల పాటు శ్రమించి మంటలార్పిన అగ్నిమాపక సిబ్బంది

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నాజ్ టాకీస్ రోడ్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. అయ్యప్ప షాపింగ్‌మాల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో దుస్తులు, ఫర్నిచర్, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది సుమారు 19 గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పారు.

దుకాణం బంద్ చేసిన గంట తర్వాత...

అయ్యప్ప షాపింగ్ మాల్(వస్త్ర దుకాణం)ను 12 ఏళ్లుగా జీ ప్లస్ త్రీ భవనంలో నిర్వహిస్తున్నారు. రోజువారిలాగే బుధవారం రాత్రి పదిన్నర గంటలకు దుకాణాన్ని మూసివేసి వెళ్లిపోయారు. రాత్రి 11.20 గంటలకు విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో లోపలి మంటలు చెలరేగి పొగలు రావడంతో నైట్ వాచ్‌మెన్ గమనించి యజమానులకు, చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది రాత్రి 12 గంటల ప్రాంతంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి యత్నించారు. వస్త్ర దుకాణం కావడంతో మంటలు అదుపులోకి రాకపోగా మరింత చెలరేగాయి.

శ్రమించిన ఆరు డివిజన్ల ఫైర్ సిబ్బంది

భారీ అగ్ని ప్రమాదం జరగడంతో మంటలను ఆర్పేందుకు కామారెడ్డితోపాటు ఎల్లారెడ్డి, రామాయంపేట, ఇందల్వాయి, గాంధారి, నిజామాబాద్ రూరల్ మండలాలకు చెందిన 50 మంది ఫైర్ సిబ్బందిని రప్పించారు. హైదరాబాద్ నుంచి భారీ డిజాస్టర్ బ్రొంటో స్కై లిఫ్ట్‌ను తెప్పించారు. పట్టణంలోని వాటర్ ట్యాంకర్ల ద్వారా 50 ట్యాంకర్ల నీటిని తెప్పించారు. భారీ పొక్లెయిన్‌ల సాయంతో షెట్టర్‌లను ధ్వంసం చేశారు. భవనం నాలుగు వైపులా గోడలను పగలగొట్టారు.

నాలుగో అంతస్తులో 30 లీటర్ల డీజిల్..

షాపింగ్ మాల్‌లోని నాలుగో అంతస్తులో జనరేటర్‌తో పాటు 30 లీటర్ల డీజిల్ ఉంది. అలాగే భవనానికి ఆనుకుని 30 దుకాణాలు, వెనకవైపు ఓ ఆస్పత్రి ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నా మంటలు చెలరేగుతూనే ఉండడంతో జనం ఆందోళన చెందారు. బ్రొంటో స్కై లిఫ్ట్‌తోపాటు ఆరు ఫైర్ ఇంజిన్ల ద్వారా 50 మంది సిబ్బంది సుమారు 19 గంటలపాటు శ్రమించి, మంటలను ఆర్పారు. దీంతో చుట్టుపక్కలున్నవారు ఊపిరి పీల్చుకున్నారు.

నష్టం రూ. 7 కోట్లపైనే..

అగ్ని ప్రమాదంలో నాలుగు అంతస్తుల భవనం అంతా ధ్వంసమయ్యింది. అలాగే భవనంలోని దుస్తులు, ఫర్నిచర్, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ. 7 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రూ. 10 కోట్లకుపైనే నష్టపోయామని షాపింగ్ మాల్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



కామారెడ్డి పట్టణంలో అగ్నికి ఆహుతవుతున్న అయ్యప్ప షాపింగ్ మాల్

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మాక్లూర్‌: మండలంలోని మహాత్మాజ్యోతిబా పూలే కళాశాలలో ఇంటర్‌ ఫస్టియర్‌ చదువుతున్న టి.సంజన జాతీయ స్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైంది. ఇటీవల స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్‌ పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ సంజీవ్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు తమిళనాడులోని తిరునూరులో నిర్వహించే వాలీబాల్‌ పోటీల్లో సంజన పాల్గొంటుందని తెలిపారు. అనంతరం సంజనను ఉపాధ్యాయులు రజిత, సాత్విక, సుమలత, అర్చన అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు..

బోధన్‌: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా స్థాయి నెట్‌బాల్‌ టోర్నమెంట్‌ అండర్‌–17 బాలుర, బాలికల జట్ల ఎంపికను ఈ నెల 15న తాడ్‌బిలోలిలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి, పీడీ సంగీత రావు గురువారం తెలిపారు. మరిన్ని వివరాలకు 9701502241 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్‌బీఐకి అదనపు హంగులు

మద్నూర్‌(జుక్కల్‌): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ అదనపు హంగులతో ఆకట్టుకుంటోంది. స్థానిక పాత బస్టాండ్‌లోని ఎస్‌బీఐలో నూతన ఫర్నిచర్‌, టైల్స్‌, రంగులు, పీవోపీ, ఫాల్‌ సీలింగ్‌ తదితర పనుల కోసం రూ.65 లక్షలు మంజూరు చేసినట్లు బ్యాంకు మేనేజర్‌ భాస్కర్‌ తెలిపారు.

‘ధరణి’ దారికి వచ్చేనా..?

- సమస్యలపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం
- రెవెన్యూ కార్యాలయాల్లో పేరుకుపోయిన దరఖాస్తులు
- సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న పట్టాదారులు



మోర్తాడ్‌: ధరణి సమస్యల పరిష్కారానికి అడుగులు ముందుకేసిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి పది రోజుల్లో నివేదికను సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధరణి సమీక్షా సమావేశంతోనైనా వెబ్‌పోర్టల్‌ దారికి వచ్చి భూముల సమస్యలకు పరిష్కారం చూపుతుందా అనే సంశయం వ్యక్తమవుతోంది. ధరణి వెబ్‌ పోర్టల్‌ అమలులోకి వచ్చిన తరువాత భూముల సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన ఆప్షన్లు ఇవ్వకపోవడంతో అనేక సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. భూముల రికార్డులలో తప్పులు దొర్లాయని అనేక మంది రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు అందించి పట్టా భూముల సమస్యలను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం అర్జిదారుల విన్నపాలను పట్టించుకోక పోవడంతో జిల్లాలో దాదాపు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2018లో డిజిటల్‌ పట్టా పుస్తకాలు జారీ చేయక ముందు ఉన్న పట్టాదారు పాసు పుస్తకాల్లో భూమి యజమాని వివరాలు సరిగా ఉన్నా ఆన్‌లైన్‌ చేసిన సందర్భంలో ఒకరి భూమి మరొకరి పేరుమీదికి మారిపోయింది. మాన్యువల్‌ పట్టా పుస్తకాల్లో భూమి వివరాలు సరిగా ఉన్నా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం రెవెన్యూ శాఖ తప్పిదమే. ఈ తప్పిదాలను సరిదిద్దడానికి ఆప్షన్లను ఇప్పటి వరకు ఇవ్వలేదు. అలాగే ఒకరి సర్వే నంబర్‌ మరొకరి పేరుపై, మాన్యువల్‌ రికార్డుల్లో పట్టా భూమి అని ఉంటే ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్‌ అని నమోదు కావడం, యజమానులు, వారి తండ్రి, భర్త పేర్లు తప్పుడుగా నమోదు కావడం, భూ విస్తీర్ణంలో తేడాలు ఇలా ఎన్నో రకాలైన సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ధరణి వెబ్‌పోర్టల్‌లో ఆప్షన్లు ఇవ్వకపోవడంతో భూముల సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే ఉండిపోయాయి. కొందరు రైతులకైతే తాము సాగు చేస్తున్న భూమి తమ ఆధీనంలో ఉన్నా వేరొకరి పేరిట పట్టా చేయడంతో రైతుబంధు, బీమా ప్రయోజనాలు దక్కలేదు. దశల వారిగా ఆప్షన్‌లను ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో మాత్రం అమలు చేయలేదు. తాము అధికారంలోకి వస్తే ధరణిలో సంస్కరణలు తీసుకురావడం లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంటూ వచ్చింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజుల్లోనే ధరణిపై సమీక్ష జరుపడంతో తమ భూసమస్యల పరిష్కారం అవుతాయని దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ధరణి దారికి తీసుకొచ్చి వీలైనంత తొందరగానే భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

ఎవరెస్ట్‌ అధిరోహించడమే లక్ష్యం


మాట్లాడుతున్న బానోత్‌ వెన్నెల

కామారెడ్డి టౌన్‌: ఎవరెస్ట్‌ శిఖరం అధిరోహించడమే తన ప్రధాన లక్ష్యమని కిలిమాంజారో పర్వత అధిరోహిణి బానోత్‌ వెన్నెల తెలిపారు. కార్గిల్‌ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన సైకిల్‌ యాత్ర బుధవారం విజయవంతంగా పూర్తి చేసి కామారెడ్డికి గురువారం చేరుకుంది. మాచారెడ్డిలోని సోమార్‌పేటకు వెళ్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌ అండ్‌ బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెన్నెల మాట్లాడుతూ.. సాహసం చేయడం తనకిష్టమన్నారు. ప్రస్తుతం పట్టణాలకు మాత్రమే పరిమితమైన సైక్లింగ్‌ పై గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్గిల్‌ నుంచి కన్యాకుమారి వరకు 3800 కిలోమీటర్ల సైకిల్‌ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అయితే ఆర్థిక స్థోమత, బ్యాంక్‌ గ్రౌండ్‌ లేకపోవడంతో ఆపన్నహస్తం కోసం గూగుల్‌లో వెతుకుతుండగా సీబీఐ మాజీ జాయింట్‌ డైరెక్టర్‌ స్థాపించిన జేడీ ఫౌండేషన్‌ కనిపించిందని, వెంటనే తన ఉద్దేశాన్ని ఫౌండేషన్‌ కు ప్రతిపాదన పంపానన్నారు. అది చూసిన ఆయన తన వాస్తవ పరిస్థితిపై విచారణ కోసం ఫౌండేషన్‌ నుంచి కొందరిని పంపించారని, వారి విచారణలో సపోర్ట్‌ చేయొచ్చు అని తెలుసుకున్నాక తనకు కాల్‌ వచ్చిందన్నారు. ఆయనే తనకు రూ.70 వేలు విలువచేసే సైకిల్‌ కొనివ్వడమే కాకుండా హైదరాబాద్‌ సైక్లింగ్‌ గ్రూప్‌ ఫౌండర్‌ రవీందర్‌ ఆధ్వర్యంలో 6 నెలలు ప్రత్యేక శిక్షణ ఇప్పించారని తెలిపారు. నవంబర్‌ 21 న ప్రారంభమైన సైక్లింగ్‌ యాత్ర 23 రోజుల పాటు 3800 కిలోమీటర్లు సాగిందన్నారు. ఈ యాత్రలో ఉన్న 13 మంది రైడర్స్‌లో తానే 17ఏళ్ల చిన్నవయస్సుదానినని తెలిపారు. తనకు ప్రభుత్వం సహకరించాలని వేడుకున్నారు. సైక్లింగ్‌ కు కృషి చేసిన జెడి లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జెడి ఫౌండేషన్‌ కన్వీనర్‌ కవితారెడ్డి, సభ్యుడు నరేశ్‌ పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

భిక్కనూరు: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల సమీపంలోని టోల్‌ గేట్‌ వద్ద జరుగుతున్న గొడవను నివారించేందుకు యత్నించిన ఏఎస్సై జగదీశ్‌, హోంగార్డు మదన్‌ల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిజామాబాద్‌కు చెందిన నార్లవార్‌ విజయకుమార్‌, కూరె దినేశ్‌, వరప్రసాద్‌ కారులో హైదరాబాద్‌ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా టోల్‌ ప్లాజా వద్ద గురువారం వేకువ జామున లారీ డ్రైవర్‌తో గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై, హోంగార్డు పెట్రోలింగ్‌ నిర్వహిస్తూ ఘటన స్థలానికి చేరుకోగా గొడవ వద్దని వారిని సముదాయించారు. మద్యం మత్తులో ఉన్న వీరు ఏఎస్సై, హోంగార్డులపై దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసులు డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్ష చేయాలని వారిని యంత్రంతో పరీక్షించడానికి వెళ్తే వారు కింద పడేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

తేది:14.12.2023

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింట్లు అయిన 1. శ్రీమతి షాహెదా బేగం @ షేక్‌ షాహెదా బేగం, 2. శ్రీమతి జహీద బేగం @ షేక్‌ జహీద బేగం, 3. శ్రీమతి అబేదా బేగం 4. షేక్‌ షహీన్‌ సుల్తానా 5. మహమ్మద్‌ గౌస్‌ జిల్లా కామారెడ్డి మరియు నిజామాబాద్‌ వాస్తవ్యులు పై క్లయింట్లు అందరు GPA దాక్యుమెంటు నం. 201/2019, తేది: 30-04-2019 మరియు GPA దాక్యుమెంటు నం. 548/2018 తేది: 26-11-2018, GPA దాక్యుమెంటు నం. 203/2019 తేది: 30-04-2019 రిజిస్ట్రేషన్‌ SRO బంజారాహిల్స్‌ హైదరాబాద్‌ కార్యాలయంలో పై అన్ని GPA లను రద్దు చేసుకోవడం జరిగింది. ఇట్టి విషయాన్ని బహిరంగ ప్రకటన తేది: 12-07-2023 రోజున నిజామాబాద్‌ మరియు హైదరాబాద్‌ ఈనాడు వార్త పత్రికల్లో ప్రచురించడం జరిగింది. ఈ GPA లలో పేర్కొన్న సర్వే నం. 127/1-D (Old సర్వే నం. 58) మొత్తం భూమి ఎకరాలు 14-00 గుంటలు బలాల్‌ఖాన్‌ గూడ గ్రామము, అమీర్‌పేట మండలము, హైదరాబాద్‌ జిల్లా నందు కలదు.

పై GPA లన్నింటికి షేక్‌ హైదర్‌ S/o. షేక్‌ మహమ్మద్‌ గారితో రద్దు పరుచుకోవడం జరిగింది. అయినప్పటికిని షేక్‌ హైదర్‌ గారు తేది: 12,13,14 డిసెంబర్‌ 2023లో స్థానిక సాక్షి తెలుగు దిన పత్రికలో క్లాసిఫైడ్‌లో ల్యాండ్‌ అమ్మకం గురించి ప్రకటన ఇవ్వడం జరిగింది. ఇట్టి ప్రకటన చెల్లు బాటు కాదు అతనితో మాకు ఎటువంటి లావాదేవిలు గాని ఒప్పందాలు గాని ప్రస్తుతం లేవు కావున సమస్త ప్రజానీకం వారితో ఎటువంటి ఒప్పందాలు, లావాదేవిలు గాని చేసుకున్నచో మాకు గాని మరియు పై తెలుపబడిన భూమికిగాని ఎటువంటి సంబంధము లేదు అని తెలియజేయడమైనది. భవిష్యత్తులో ఎవరైనా ఒప్పందాలు చేసుకున్నట్లయితే వారు పూర్తి భాద్యత వహించగలరు.

Sd/- మామిళ్ళ సాయిరెడ్డి,
అడ్వకేట్‌, నిజామాబాద్‌. సెల్‌: 9440004143.

జన్మభూమి రుణం తీర్చుకునేందుకు..


ఈసీజీ యంత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న సభ్యులు

బాన్సువాడ: జన్మభూమి రుణం తీర్చాలనే ఆశయంతో పేదలకు నీటిశుద్ధి ప్లాంటు ఏర్పాటు, ఈసీజీ యంత్రాన్ని అమెరికా తెలుగు సంఘం సభ్యులు అందజేయడం సంతోషకరమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌ రెడ్డి అన్నారు. బాన్సువాడ మాతా శిశు సంరక్షణ ఆస్పత్రిలో అమెరికా తెలుగు సంఘం, జనహిత సంస్థ ఆధ్వర్యంలో మంచినీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు, ఈసీజీ యంత్రాన్ని చేశారు. అందజేశారు. వెయ్యి లీటర్ల మంచినీటి శుద్ధి యంత్రం ఏర్పాటుతో రోగులకు, సహాయకులకు మంచినీరు అందుతుందని అన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 1999లో బాన్సువాడలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్‌ సెంటర్‌, బ్లడ్‌ బ్యాంకును ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆటా, జనహిత సంస్థ సభ్యులు తిమ్మాపూర్‌ వేంకటేశ్వర ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆటా వేడుకల చైర్‌, ఎలక్ట్‌ ప్రెసిడెంట్‌ జయంత్‌ చల్లా, కార్యదర్శి రామ కృష్ణారెడ్డి, దాతలు హిమబిందురెడ్డి, బోడ అశ్విన్‌రెడ్డి, జనహిత సంస్థ నిర్వాహకులు ఆర్‌. సతీశ్‌రెడ్డి, రఘుపతి రెడ్డి, ఏరియా ఆస్పత్రి సుపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ప్రసాద్‌, రైతుబంధు సమితి జిల్లా కో–ఆర్డినేటర్‌ అంజిరెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ జుబేర్‌, నాయకులు కృష్ణారెడ్డి, ఎజాస్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌ సభ్యుడిగా సుధాకర్‌



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌ సభ్యుడిగా జిల్లాకు చెందిన బీర్కూర్‌ సుధాకర్‌ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 12, 13వ తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్‌లో ఆరుగురు సభ్యుల కోసం ఎన్నికలు నిర్వహించారు. జిల్లాకు చెందిన బీర్కూర్‌ సుధాకర్‌ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సుధాకర్‌ను కెమిస్ట్‌ అండ్‌ డ్రగ్గిస్ట్‌ మెడికల్‌, మెడికల్‌ ఏజెన్సీ సభ్యులు సన్మానించారు. జిల్లాలో ఉన్న మెడికల్‌ కెమిస్ట్‌ అండ్‌ డ్రగ్గిస్ట్‌ అసోసియేషన్‌ సభ్యులకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సుధాకర్‌ పేర్కొన్నారు.

నిజాంసాగర్‌ నీటి విడుదల

నిజాంసాగర్‌: యాసంగి పంటల సాగు అవసరాలకు నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ శివ ప్రసాద్‌ గురువారం తెలిపారు. ఆయకట్టు కింద వరినాట్లు, వ్యవసాయ పనులకు సాగు నీరు అవసరం ఉందని రైతులు కోరడంతో ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 1,500 చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 15 రోజుల పాటు నీటి విడుదల కొనసాగుతుందని చెప్పారు. ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటిని ఆయకట్టు ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



సిరికొండ: జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో సిరికొండ ప్రభుత్వ ఆదర్శ కళాశాలకు చెందిన విద్యార్థి అనుదీప్‌ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు పీడీ కిషన్‌ గురువారం తెలిపారు. అనంతరం అనుదీప్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ గంగా ప్రసాద్‌, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి

సిరికొండ: మండలంలోని దుప్య తండాకు చెందిన బుక్య రవిపై అదే తండాకు చెందిన బుక్య వినోద్‌ కత్తితో దాడి చేసినట్లు ధర్పల్లి సీఐ సైదా తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఒకే తండాకు చెందిన వీరికి మూడేళ్లుగా గొడవ ఉంది. తండా సమీపంలోని చీమన్‌పల్లిలో వినోద్‌ తన మిత్రులతో కలిసి మద్యం సేవిస్తుండగా అక్కడికి రవి వెళ్లాడు. దీంతో వీరి మధ్య గొడవ జరిగింది. రవిపై వినోద్‌ కత్తితో గొంతుపై, ఛాతి భాగంలో దాడి చేసి పీఎస్‌లో లొంగిపోయినట్లు సీఐ పేర్కొన్నారు. ఎస్సై రమేశ్‌ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స నిమిత్తం భీంగల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పోస్టల్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌గా జనార్దన్‌



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ జిల్లా పోస్టల్‌ సీనియర్‌ సూపరింటెండెంట్‌గా కె. జనార్దన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌ జనరల్‌ పోస్టాఫీస్‌ చీఫ్‌ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జనార్దన్‌రెడ్డి నిజామాబాద్‌కు అడహక్‌ పదోన్నతిపై వచ్చారు. ఇప్పటి వరకు అడిషనల్‌ సూపరింటెండెంట్‌గా హన్మకొండ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ హనుమంత్‌ విధులు నిర్వహించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరం

నిజామాబాద్‌నాగారం: ఆధునిక యుగంలో మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని జిల్లా ఐసీడీఎస్‌ సంక్షేమశాఖాధికారి రసూల్‌బీ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌ మైదానంలో స్నేహసొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. మానసికంగా ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కోవడానికి ప్రతినిత్యం క్రీడలు సాధన చేయాలన్నారు.

ఈ నెల 19న నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, గ్రేసీ ఆర్గనైజేషన్‌ ప్రెసిడెంట్‌ శోభారాణి, ఏపీ ఫోరం ప్రెసిడెంట్‌ స్వరూప, రాజన్న, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్యారం ఆడుతున్న చిన్నారులు





సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION
■ 10th, Inter (తెలంగాణ ఓపెన్‌ స్కూల్‌) వన్‌ సిట్టింగ్‌ కేవలం 3 నెలలలో 10th, ఇంటర్‌ కంప్లీట్‌ చేయవచ్చు. పోస్టల్‌ డిపార్ట్‌మెంట్‌లో కాంట్రాక్ట్‌ జాబ్స్‌కలవు. Ph:9553194030, 9848912447. [H-788027]

SERVICES
■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్‌ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్‌ ఫైనాన్స్‌, రాజన్‌, సెల్‌: 8437924006. [W-788966]

PASSPORT MISSING
■ సాపురం రాములు S/o. సాపురం శివలింగం R/o. నందిపేట్‌, NZB. నేను 02/10/2023 నాడు మా ఇంటి నుండి బస్టాండ్‌కి వెళ్తుండగా V9673289 నెం॥ గల పాస్‌పోర్ట్‌ పోయినది. దొరికినచో సంప్ర॥ 9908166020. [Z-799670]

REAL ESTATE

LAND FOR SALE
■ హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌ మండలంలో బహలుల్‌గూడ నందు Sy No: 58 (Old) / 127/1 - D (New) నందు 14 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. డైరెక్ట్‌ సెల్‌ GPA Holder, Shaik Haider. Cell: 9030117702. [Z-799663]

WANTED
■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజ్‌ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌ టైమ్‌ / ఫుల్‌ టైమ్‌గా వర్క్‌ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9849933042. [M-1221945]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్‌
CONTACT: 9492010949

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్‌

బోధన్‌లో దాబాలపై దాడి

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణ శివారులోని దాబాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది కలిసి దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్‌ సీఐ రూప్‌సింగ్‌ గురువారం తెలిపారు. ఏడుగురు దాబాల నిర్వాహకులను అరెస్టు చేసి తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా దాబాల్లో మద్యం విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మొరం వాహనాలు పట్టివేత

కోటగిరి: మండలంలోని రాంపూర్‌ శివారులో ఉన్న గుట్ట ప్రాంతం నుంచి అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతున్న మొరం వాహనాలను పట్టుకొని సీజ్‌చేసినట్లు తహసీల్దార్‌ ప్రభాకర్‌ గురువారం తెలిపారు. గుట్టలో తవ్వకాలు చేపడుతున్న జేసీబీతో పాటు టిప్పర్‌, రెండు ట్రాక్టర్లను సీజ్‌ చేసి తహసీల్‌ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఎవరైనా మొరం, ఇసుక రవాణ చేపడితే జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిట్లంలో బైక్‌ దహనం

పిట్లం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణ బైక్‌ను దుండగులు బుధవారం రాత్రి దహనం చేశారు. కృష్ణ తన బైక్‌ను రాత్రి ఇంటి ఎదుట ఉంచి నిద్రించగా మరుసటి రోజు దహనమై కనిపించిందని బాధితుడు కృష్ణ గురువారం తెలిపారు. గత మూడు నెలల క్రితమే ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశానని ఎవరో కావాలనే తనపై కక్ష్య సాధింపు చర్యతో ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టారని అన్నారు. ఈ ఘటనపై పిట్లం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

యువకుడి అదృశ్యం

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన మహ్మద్‌ షకీల్‌ అనే యువకుడు అదృశ్యమైనట్లు సీఐ వీరయ్య గురువారం తెలిపారు. రాకాసీపేట్‌కు చెందిన షకీల్‌ నవంబర్‌ 18న ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం నెల్లూరులో ఉన్న ఓ దర్గాకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదన్నారు. బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

తాడ్వాయి): ఎర్రాపహాడ్‌ గ్రామంలో పేకాట స్థావరంపై దాడిచేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. దాడిలో 8గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 58,670 నగదు, 8 ఫోన్లు, రెండు బైక్‌లు, కారును స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

వేల్పూర్‌: లక్కోర గ్రామ శివారులో కారు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్‌గల్‌ మండలం పల్లికొండకు చెందిన మహేశ్‌ తన కారులో నిజామాబాద్‌కు వెళ్తుండగా వేల్పూర్‌కు చెందిన ఇద్దరు జీపీ వర్కర్లు మొండి రాజ్‌కుమార్‌, తోపారం దీపక్‌ బైక్‌పై వేల్పూర్‌కు వస్తుండగా లక్కోర వంతెన వద్ద కారు బైకును, వీరి వెనుకాలే ఉన్న మరో బైకుఉను ఢీకొన్నది. ఈ ఘటనలో రాజ్‌కుమార్‌, దీపక్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆర్మూర్‌లోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రుల్లో వీరు చికిత్స పొందుతున్నారు.

గుర్తుతెలియని యువతి హత్య


లభ్యమైన పట్టగొలుసులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రామన్‌, ఎస్సై రాజు

సదాశివనగర్‌: మండలంలోని భూంపల్లి శివారులో గుర్తు తెలియని యువతిని దుండగులు హత్య చేసి నిప్పంటించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ రామన్‌, ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యువతిని దుండగులు ఎక్కడో హత్య చేసి ఈ ప్రాంతంలో నిప్పంటించినట్లు పేర్కొన్నారు. మృతదేహం శరీరభాగాలు పూర్తిగా కాలిపోయాయని, పింక్‌రెడ్‌ చుడీదార్‌, గోధుమ రంగు ప్యాంట్‌ను యువతి ధరించి ఉందన్నారు. పాదాల భాగం పూర్తిగా కాలకపోవడంతో పట్టగొలుసులు లభ్యమైనట్లు తెలిపారు. డాగ్‌ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఆయా పీఎస్‌లలో మిస్సింగ్‌ కేసుల వివరాలను సీఐ తెలుసుకున్నారు. ఘటనా స్థలం వద్దే వైద్యాధికారిచే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. పోలీస్‌ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

కొడిచర్లలో చిరుత కలకలం


చిరుత సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

పొతంగల్‌: మండలంలోని కొడిచర్ల శివారులో చిరుత సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూర్‌ గ్రామానికి చెందిన సాయిలు బుధవారం రాత్రి పొతంగల్‌ నుంచి కల్లూర్‌కు వెళ్తుండగా కొడిచర్ల శివారులో రోడ్డుపై చిరుత కనిపించినట్లు చెప్పారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న ఫారెస్ట్‌ సిబ్బంది కొడిచర్ల శివారులో గురువారం పర్యటించి ఆనవాళ్ల కోసం గాలించారు. అనంతరం ఫారెస్ట్‌ బీట్‌ ఆఫీసర్‌ వందన మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల్లో చిరుత పాద ముద్రల ఆనవాళ్లు దొరకలేదన్నారు. ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా చిరుత కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

జీపీ కో–ఆప్షన్‌ సభ్యుడి మృతి



భిక్కనూరు: భిక్కనూరు జీపీ కో–ఆప్షన్‌ సభ్యుడు, రిటైర్డ్‌ ఉపాధ్యాయుడు నీల లింగయ్య (81) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన అంత్యక్రియల్లో మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ పురాం రాజమౌళి, సర్పంచ్‌ తున్కి వేణు, కో–ఆప్షన్‌సభ్యులు రాయనగారి శ్రీనివాస్‌, అజారొద్దీన్‌, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిదులు పాల్గొని నివాళి అర్పించారు.

గోదావరిలో మృతదేహం లభ్యం



బోధన్‌: రెంజల్‌ మండలంలోని గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉదయ్‌ కుమార్‌ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 65 ఏళ్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 8712659874 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన కమ్మర్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గాంధీనగర్‌లో అల్లెపు ప్రసాద్‌ భార్య లక్ష్మి, ముగ్గురు ప్లిలలతో కలిసి నివాసం ఉంటున్నారు. ఉపాధి నిమిత్తం ప్రసాద్‌ ఆరు నెలల క్రితం బహ్రెయిన్‌ వెళ్లాడు. నాటి నుంచి భార్యపై అనుమానం పెంచుకొని ఫోన్‌లో తరచూ వేదిస్తున్నాడు. డబ్బుల విషయంలో వీరి మధ్య గొడవ జరుగుతోంది. గురువారం ఉదయం ప్రసాద్‌ లక్ష్మితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. డబ్బుల విషయమై మళ్లీ గొడవ జరగడంతో తాను చనిపోతున్నట్లు చెప్పి వీడియో కాల్‌ను లక్ష్మి కట్‌ చేసి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ప్రసాద్‌ పక్కింటి వారికి ఫోన్‌ చేసి విషయం తెలుపడంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి హన్మవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో..

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన నాగయ్య(50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. ఒంటరిగా నివసిస్తున్న నాగయ్య జీవితంపై విరక్తి చెంది పది రోజుల క్రితం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..



బీబీపేట: ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బీబీపేటకు చెందిన బ్యాగరి పరశురాములు (33) వృత్తిరీత్యా కూలీ పని చేస్తూ జీవించేవాడు. ఆయనకు అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య బ్యాగరి పింకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.